క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి కృషి

నందవరం: గ్రామాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని సర్పంచ్ విరుపాక్షిరెడ్డి అన్నారు. బుధవారం ముగతి గ్రామంలో శ్రీ గోకరమయ్య స్వామి కట్ట వద్ద ఉన్న డ్రైయినేజీని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలో ఎన్నో యేళ్లుగా ఉన్న గోకరమయ్య స్వామి కట్ట వద్ద ఉన్న డ్రైయినేజీలో పూడిక పేరుకుపోవడంతో పాటు శిథిలావస్థకు చేరుకుందన్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో గ్రామంలో స్వామి కట్ట వద్ద నూతన డ్రైయినేజీ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తం

మద్దికెర: దోమల వల్ల వ్యాపించే మలేరియా వ్యాధి పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవం పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో సిబ్బందికి మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో వైద్య సిబ్బందితో పాటు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి డీడీటీ మందులు పిచికారీ చేయించడమే గాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమ తెరలు వాడాలని సూచించారు. ఖాళీ టైర్లు, కుండీలు, తొట్టెలు, డ్రమ్ముల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సీహెచ్‌ఓ నిరంజన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశులు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాష తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయించరాదు

మద్దికెర: ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు రైతులకు విక్రయించి మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ రవి హెచ్చరించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని అగ్రి డీలర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్సు లేకుండా షాపులు నిర్వహించినా నకిలీ విత్తనాలు విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఉత్పత్తులు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపండి

వెల్దుర్తి: జగనన్న కాలనీలతో పాటు, వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలలో, ఉపాధి పనుల కల్పనలో పురోగతి చూపాలని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ శ్రీనివాసకుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల మండల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం వెల్దుర్తి వైఎస్సార్ జగనన్న కాలనీని సందర్శించి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. థర్డ్ పార్టీ ద్వారా హౌసింగ్ అధికారులు ప్రారంభిస్తున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏఓ అక్బర్‌బాషా, పీఆర్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి, ఏపీఓ రాజునాయక్, ఏపీఎం చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ అరవింద్ ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

నందవరం: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వివేకానంద స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తిరుమల, సామాజికవేత్త, మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్. ఆల్ఫ్రేడ్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కే.పేట గ్రామంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని, అమర జవాను కురువ మనోహర్ జ్ఞాపకార్థం బ్లడ్ డొనేషన్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో దాదాపు 30 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి సరైన సమయంలో రక్త దానం చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. యువకులు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సభ్యులు అజిత్, సామేల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

20 మంది రక్తదానం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వివేకానంద లైబ్రరీ ఆవరణలో రైసింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 20 మంది యువకులు రక్తదానం చేశారు.వారిని నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేశారు.

ఆర్బీకేల్లో అందుబాటులో విత్తనాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అన్ని ఆర్‌బీకేల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 14 ఆర్‌బీకేల ద్వారా దాదాపు 1,700 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రైతులకు అందజేశామన్నారు. గ్రామాల్లో విత్తనాలు అవసరమైన రైతులు ఆర్బీకేల్లో తీసుకోవాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

రీసర్వే పూర్తి చేయండి

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ నాగరాజు ఆదేశించారు. ఆయన బుధవారం వీఆర్వోలతో మాట్లాడుతూ.. భూముల రీసర్వే వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. భూమి కొలతలు సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. భూములను శాటిలైట్ ద్వారా కొలతలు వేయడం జరిగిందని అందుకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలలో జాబితా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

గృహ యోగం

- పేదల సొంతింటి కల సాకారం
- నియోజకవర్గానికి 6,954 ఇళ్లు మంజూరు
- రూ. 56.80 కోట్ల బిల్లుల మంజూరు

అడుగడుగునా అడ్డంకులు.. అర్థం పర్థం లేని ఆరోపణలు.. ఊరికి దూరమన్నారు.. ఆ డబ్బుతో ఇల్లు ఎలాగన్నారు.. లబ్ధిదారుల మనసులో విషబీజాలు నాటే ప్రయత్నాలు ఎన్నో చేశారు. ఇలాంటి విమర్శల రాళ్లతో ఇప్పుడు ఏకంగా ఊళ్లు నిర్మితమవుతున్నాయి. ఆ ఏడ్చిన కన్నీటితోనే అద్భుతమైన ఇళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. అసాధ్యమన్న వారి కళ్లు బైర్లు కమ్మేలా 'నవ రత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కొత్త చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది.


జి.ఎర్రగుడి జగనన్న కాలనీలో పూర్తయిన ఇల్లు


పగిడిరాయిలో చురుగ్గా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు

పత్తికొండటౌన్/తుగ్గలి: ఇంటి బాడుగలు.. కుటుంబ పోషణ.. పిల్లల చదువులు.. పెళ్లిళ్లు.. ఆస్పత్రి ఖర్చులు.. ఇలా చెప్పుకుంటూ పోతే నిరుపేదల జీవనం దిన దిన గండమే. ఇలాంటి పరిస్థితుల్లో సొంతిల్లంటే మాటలు కాదు.. కలే. ఎప్పటికైనా తమ కష్టంతో సొంత ఇళ్లు నిర్మించుకోవాలని, అందులో కాపురం ఉండాలని ఎవరికుండదు. ఆ కలే నిరంతరం కష్టానికి పునాది. అయినా ఎన్నో జీవితాలు ఇలా కలలోనే కలిసిపోతాయి. ఇలాంటి ఎంతో మంది కలను సాకారం చేస్తూ.. ఓ ఇంటి వాళ్లను చేస్తోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ప్రభుత్వ సాయంతో తమ కలల సౌధాన్ని నిర్మించుకుంటూ తమ కలను నెరవేర్చుకుంటున్నారు నిరుపేదలు.

నియోజకవర్గంలో నిర్మాణాలు ఇలా..				
మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి	మొత్తం నిధులు (రూ.కోట్లలో)
పత్తికొండ	1,951	478	1,473	14.07
తుగ్గలి	1,648	447	1,171	11.04
మద్దికెర	798	305	448	7.86
కృష్ణగిరి	593	185	397	4.71
వెల్దుర్తి	1,964	846	1,110	19.12
మొత్తం	6,954	2,261	4,599	రూ.56.80 కోట్లు

పత్తికొండ నియోజకవర్గంలో 6,954 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటివరకు 2,261 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.56.80 కోట్లు ఖర్చు చేసింది. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు ఆనందోత్సాహాలతో గృహ ప్రవేశాలు చేసుకుంటున్నారు.

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



మాకు ప్రభుత్వమే ఇంటి స్థలంతో పాటు, ఇంటి నిర్మాణానికి అవసరమైన నగదు, సామగ్రి అందజేసింది. రూ.1.70 లక్షలు బిల్లు మంజూరైంది. ఆ సహకారంతో మా దగ్గర ఉన్న కొంత డబ్బు కలిపి ఇళ్లు కట్టుకొని గృహప్రవేశం కూడా చేశాం. సొంతింటి కల నేరవేరినందుకు సంతోషంగా ఉంది. ఇళ్లు నిర్మించుకోవాలన్న మా కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– సుకన్య, జి.ఎర్రగుడి గ్రామం

స్థలమే కాదు.. ఇంటి బిల్లు ఇస్తున్నారు



మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. కూలీనాలీ పోయి బతుకుతున్నాం. ఇన్నాళ్లు సొంతిళ్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. బస్టాండ్‌లోనే నివాసం ఉంటున్నాం. గత ప్రభుత్వంలో ఎలాంటి లబ్ధి పొందలేదు. స్థలం గాని, ఇళ్లు గాని ఇచ్చేవారే కరువయ్యారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక గ్రామానికి చేరువలోనే ఇంటి స్థలం ఇచ్చారు. ఇళ్లు కట్టుకోవడానికి రూ.1.80 లక్షలు మంజూరయ్యాయి. సొంతింటి కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది.

– మాదమ్మ, పెండేకల్లు గ్రామం

నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



నియోజకవర్గంలో గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే జగనన్న లే అవుట్లలో విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించింది. నియోజకవర్గంలో ఇప్పటికే 2,261 ఇళ్లు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.57.29 కోట్లు ఖర్చు చేసింది. ఈ నెలాఖరుకు 3,600 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– గురుప్రసాద్, డీఈఈ, గృహనిర్మాణ శాఖ, పత్తికొండ

నేటి నుంచి ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

వెల్దుర్తి: గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన ఉపాధి పనుల సోషల్ ఆడిట్‌కు సంబంధించిన గ్రామసభలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏపీఓ రాజునాయక్ తెలిపిన మేరకు.. గ్రామస్థాయిలో (పంచాయతీ కేంద్రంగా) జరుగనున్న విచారణ షెడ్యూల్ ప్రకారం 15వ తేదీ గురువారం ఉదయం అల్లుగుండు, నార్లాపురంలో, మధ్యాహ్నం లక్ష్మీనగరం, బోయనపల్లెలో గ్రామ సభ నిర్వహించి విచారణ ప్రారంభించనున్నారు. 16న సాయంత్రం శ్రీరంగాపురం, బింగిదొడ్డిలో, 18న ఉదయం సర్పరాజాపురం, మధ్యాహ్నం కృష్ణాపురం, కలుగొట్ల, సాయంత్రం వెల్దుర్తి, వుల్లగుమ్మిలో, 19న ఉదయం గోవర్ధనగిరి, మధ్యాహ్నం రామళ్లకోటలో, 20న ఉదయం నర్సాపురం, మధ్యాహ్నం రత్నపల్లె, సాయంత్రం చెరుకులపాడులో, 21న ఉదయం సూదేపల్లె, పేరేముల, సాయంత్రం బోగోలు, బుక్కాపురం, మల్లెపల్లె, బొమ్మిరెడ్డిపల్లెలో, 22న ఉదయం మదార్‌పురంలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. 23వ తేదీ ఉదయం నుంచి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మండలస్థాయి విచారణ ఉంటుందన్నారు. సోషల్ ఆడిట్‌కు ఎస్‌ఆర్‌పీ (స్టేట్ రిసోర్స్ పర్సన్)లుగా మల్లికార్జున, తిరుమలేశ్ వ్యవహరించనున్నారు. ఇప్పటికే డీఆర్‌పీలు గ్రామస్థాయిలో జరిగిన పనుల పరిశీలన కొనసాగిస్తున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మద్దికెర: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడమే గాకుండా వైద్యుల సలహాలు పాటించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు చేయించుకోవడం వల్ల సురక్షితమే గాకుండా ప్రభుత్వం అందించే పథకాలు వర్తిస్తాయన్నారు.

ప్రజా శ్రేయస్సే జగనన్న లక్ష్యం


ఎమ్మిగనూరు 32వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని 32వ వార్డులో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులు తదితరులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇళ్లకు వెళ్లి వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తూ, లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, ప్రభుత్వ పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు మద్దతు ఇస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, టీడీపీ నేతల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు నిర్మించాలని కొందరు ఆయన దృష్టికి తీసుకురాగా సత్వర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం పట్టణంలోని వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు జేవీకే కిట్లను పంపిణీ చేశారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి అవకాశాలు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యలోను నైపుణ్యం పెంచుకొంటే ఉపాధి అవకాశాలు పొందవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పేర్కొన్నారు. స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన రెండవ బ్యాచ్ విద్యార్థులకు బుధవారం కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి న్యూటన్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, స్కిల్ హబ్ సమన్వయకర్త సుధాకర్‌బాబుతో కలిసి సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిర్దిష్టమైన ప్రణాళిక, అంకితభావంతో ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. స్కిల్‌హబ్ ట్రైనర్ అశోక్, సూపరింటెండెంట్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య


అంగన్‌వాడీ విద్య, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సఫరున్నిసా బేగం

నందవరం: ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య బోధిస్తున్నట్లు సీడీపీఓ సఫరున్నీసా బేగం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్సీ భవనంలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వరకు ఐసీడీఎస్ అధికారులు, మండల అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం-8లో తల్లులకు పూర్వప్రాథమిక విద్య, సంపూర్ణ ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మూడేళ్ల వయసున్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ఏసీడీపీఓ మద్దమ్మ, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, డీటీ రఘువీర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా కానుక పంపిణీ


చుంచుఎర్రగుడి పాఠశాలలో విద్యా కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీకాంతరెడ్డి


మద్దికెర ఆదర్శ పాఠశాలలో కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి

బాధ్యతల స్వీకరణ




ఎస్.మనోజ్‌రెడ్డి రామాంజనేయులు బి.అమర్నాథ్

పత్తికొండ రూరల్: పత్తికొండ తహశీల్దారుగా ఎస్. మనోజ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గత కొన్నినెలలుగా ఇన్‌చార్జ్ తహసీల్దారుగా విష్ణుప్రసాద్ ఉన్నారు. కడప జిల్లా రాయచోటికి చెందిన మనోజ్‌రెడ్డి 2022 బ్యాచ్ గ్రూప్-1 రాష్ట్రస్థాయి 6వ ర్యాంకు సాధించారు. కర్నూలు కలెక్టరేట్‌లో విధుల్లో ఉన్నారు. 2 నెలల శిక్షణలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పత్తికొండ తహసీల్దారుగా విధుల్లో చేరారు.

ఆలూరు రూరల్: మండల ఎంఈఓగా రామాంజినేయులు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవలే జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పామిడి మండలం నుంచి ఆలూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ కోమలాదేవి కౌతాళం మండలంకు బదిలీపై వెళ్లారు.

ఎమ్మిగనూరుటౌన్: అనంతపురం ఆర్టీసీ కమర్షియల్ ఏటీఎంగా పనిచేసిన బి.అమర్నాథ్ బదిలీపై వచ్చి స్థానిక ఆర్టీసీ డిపోకు ఇన్‌చార్జ్ మేనేజర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డిపో మేనేజర్‌గా పనిచేసిన నాగభూషణం అనంతపురం వెళ్లారు.

18న శ్రీశైలం తాత ఆరాధనోత్సవాలు

ఆస్పరి: ములుగుందంలో వెలసిన అవధూత శ్రీశైలం తాత 12వ ఆరాధనోత్సవాలు ఈనెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. 18వ తేదీన తాత సమాధికి గంగపూజ, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి భజన పోటీలు

ఆరాధనోత్సవాల సందర్భంగా ఈనెల18న రాత్రి రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు వెంకటరెడ్డి, కృష్ణమూర్తి తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు అదే రోజు సాయంత్రంలోపు రూ.250 ఎంట్రీ ఫీజు చెల్లించి బృందం పేరును నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి అరతులం బంగారం, రెండో బహుమతి 25 తులాల వెండి, మొత్తం 18 స్థానాలకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9505286102, 6304167849 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మెరుగైన సేవలందించండి

కృష్ణగిరి: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కార్యదర్శుల పాత్ర కీలకమని ఎంపీడీఓ విశ్వమోహన్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో గ్రామాల్లో తాగునీటి పైపుల లీకేజీల పట్ల సర్పంచ్‌లు, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షపునీరు రహదారులపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీరు ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సమస్యలపై సచివాలయాలకు వచ్చే బాధితుల పట్ల హుందాగా వ్యవహరించాలన్నారు. సూపరింటెండెంట్ రామస్వామి, అన్ని గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల వేలం

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామ పంచాయతీకి సంబంధించిన వ్యవసాయ భూముల కౌలు హక్కుల వేలం రూ.4.14 లక్షలు పలికింది. బుధవారం జొహరాపురంలో సర్పంచ్ నెల్లూరప్ప ఆధ్వర్యంలో పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు సమక్షంలో 2023-24కు సంబంధించి పంచాయతీకి చెందిన 52 ఎకరాల భూమి కౌలు హక్కులకు వేలం నిర్వహించారు. గ్రామ రైతులు వేలం పాల్గొన్నారు. సర్వే నంబర్లు 578, 645, 646, 648లో 52 ఎకరాలను షేక్షావలి, గురుస్వామి, ఈరన్న అనే రైతులు రూ.4.14 లక్షలకు దక్కించుకున్నారు. ఈఓఆర్‌డీ సూర్యనరసింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి నాయక్, వీఆర్‌ఓ మాబుసుభాని తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

తుగ్గలి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా మండలంలో చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్ ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులను చైతన్యపరిచి నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం పగిడిరాయి, కడమకుంట్ల జగనన్న లే అవుట్లను సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రతి లబ్ధిదారుడు ఇల్లు కట్టుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఇంటి పట్టా రద్దవుతుందన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మరిన్ని సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ సావిత్రి, హౌసింగ్ ఏఈ విజయకుమార్ పాల్గొన్నారు.

కూలీలందరికీ పనులు కల్పించండి

కృష్ణగిరి: గ్రామాల్లో ఉన్న కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓలు అబ్దుల్‌షకూర్, శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం వారు ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనా కూలీలు పనులకు వస్తున్నారని అడిగిన వారందరికీ పనులు కల్పించాలని సూచించారు. చేసిన పనులకు సంబంధించి మస్టర్లు వెంటనే అప్‌లోడ్ చేసి కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పండ్ల తోటల పెంపకానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన సిలివేరి సౌజన్య అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో స్థానిక పద్మశాలి సంఘ సభ్యులు బుధవారం ఆమెకు రూ.45 వేల ఆర్థిక సాయం అందజేశారు. చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో నగదు అందజేసినట్లు వారు తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం


రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండటౌన్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం పత్తికొండలో జరిగిన కార్యక్రమంలో రూ.96 లక్షల విలువ చేసే వ్యవసాయ సబ్సిడీ పరికరాలను ఎమ్మెల్యే రైతులకు పంపిణీ చేశారు. కృష్ణగిరి మండలం పోతుగల్లు, మల్లాపురం, ఎర్రబాడు, మన్నేకుంట గ్రామాలకు చెందిన రైతులకు వాటర్‌షెడ్ పథకం కింద రూ.90 లక్షల విలువ చేసే సబ్సిడీ వ్యవసాయ పరికరాలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు టార్పాలిన్లు, పీవీసీ పైపులు, ఆయిల్ ఇంజిన్లు, తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతాంగానికి చేయూతనందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. వాటర్‌షెడ్‌ప్రోగ్రాం అధికారి శ్రీధర రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ రైతులకు 80 శాతం సబ్సిడీతో పరికరాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, డ్వామా ఏపీడీ సలీంబాషా, ఆగ్రో జిల్లా మేనేజర్ జయ చంద్రారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ మహాదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో రక్షణ


మహిళల సెల్‌ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న ఎంఎస్‌కేలు,ఏఎస్‌ఐ విజయ్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: సెల్‌ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల ఆపదలో ఉన్న మహిళలకు అండగా ఉంటుందని పట్టణ సీఐ మధుసూదన్ రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కాలేజీ విద్యార్థినులు, మహిళలు, యువత సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు రక్షణ కవచంగా ఉండేందుకు దిశ యాప్‌ను తీసుకువచ్చిందని చెప్పారు. ఆపదలో ఉన్న మహిళ, యువతి, విద్యార్థినులు దిశ యాప్‌కు రింగ్ చేస్తే చాలని వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని రక్షణ కల్పిస్తారని వివరించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు, ఆటోలలో ఎక్కినప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఏ మాత్రం అనుమానం కలిగినా వెంటనే ఈ యాప్‌లో అత్యవసర బటన్ నొక్కాలని సూచించారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

కృష్ణగిరి: వేసవి సెలవులు ముగించుకుని పాఠశాలకు వచ్చిన బాలిక గంటన్నరలోపే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని జి.మల్లాపురం గ్రామానికి చెందిన మాదిగ చిట్టిబాబు, సువార్త దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె లుథియా (14) కంబాలపాడు బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి నుంచి చదువుతూ ప్రస్తుతం 7వ తరగతి పూర్తి చేసుకుంది. సెలవుల అనంతరం బుధవారం సాయంత్రం లుథియాను ఆమె తండ్రి చిట్టిబాబు బైక్‌పై తీసుకొచ్చి 4.52 గంటలకు పాఠశాలలో వదిలివెళ్లాడు. తోటి మిత్రులతో ముచ్చటించిన లుథియా 'మీరు వెళ్లండి నేను టాయ్‌లెట్‌కి వెళ్లి వస్తాను' అని చెప్పి పంపింది. సాయంత్రం 6 గంటలకు భోజన సమయానికి కేర్‌టేకర్ విద్యార్థులను చెక్ చేసుకోగా లుథియా కనిపించలేదు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గాలించగా 9వ తరగతి గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని నిర్జీవంగా కనిపించింది. వెంటనే పోలీసులు, బాలిక తల్లితండ్రులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్ఐ మృతదేహాన్ని కిందకు దించారు. శవాన్ని పోస్ట్‌మార్టంకు పంపి పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. పాఠశాలకు వచ్చిన గంటన్నర లోపే కూతురు విగతజీవిగా కనిపించడంతో తల్లితండ్రులు గుండెలు బాదుకుంటూ విలపించారు. గురుకులాల డీసీఓ వెంకట్రావ్, పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్, తహసీల్దార్ పురుషోత్తం అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి తల్లిదండ్రులను ఓదార్చారు.

టాపర్లకు అవార్డులు

ఆలూరు: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం స్థానిక ఆర్టీటీ ఆడిటోరియంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు ఎంఈఓ రామాంజనేయులు తెలిపారు. పదో తరగతిలో శరవాని స్వామి (569 మార్కులు), శ్రీనివాసులు (566), సలేమ (563) అవార్డులకు ఎంపికయ్యారు. ఇంటర్మీడియెట్ వివిధ గ్రూపుల టాపర్లు జె.పద్మావతి (973 మార్కులు), టి.జయమ్మ (944), బి.శాంతమ్మకు (741), బి.శివలింగమ్మ (944) అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు

విద్యుత్ సమస్యలపై సమావేశం

వెల్దుర్తి: రామళ్లకోటలో గృహాలకు, వ్యవసాయ బోర్లకు నాణ్యమైన విద్యుత్ అందిస్తుండడంపై గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం విద్యుత్ శాఖ మండల అధికారి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రామళ్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. గ్రామస్తులు మాట్లాడుతూ ..గ్రామంలో రెండు చోట్ల పాత స్తంభాలను మార్చాలని, ఎత్తు పెంచాలని కోరారు. వెంటనే చర్యలు తీసుకుంటానని ఏఈ తెలిపారు.

పాఠశాలల తనిఖీ

హాలహర్వి: మండలకేంద్రంలోని జెడ్పీ, ఎంపీయూపీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు తనిఖీ చేశారు. భోజనం నాణ్యతను పరిశీలించారు. అలాగే జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏడుగురిపై కేసు నమోదు

వెల్దుర్తి: యాదరాళ్ల గ్రామంలో ఇరువర్గాలకు చెందిన ఏడుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. రెన్నెళ్లుగా ఒకరిపై ఒకరు నిందలు మోపుకుంటూ ఇళ్ల ముందు స్థలాలు, పార్కింగ్, రాకపోకలపై వాదులాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నందున ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశామన్నారు.